ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

తాగునీటి పథకాలపై శ్రద్ధేదీ..?

◆ ఇలాగైతే వేసవిలో కష్టాలే
◆ కొన్నిచోట్లకే పరిమితమైన ఇంటింటికీ కుళాయిలు

కోటవురట్ల మండలంలోని తాగునీటి పథకం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో తాగునీటి పథకాలు, వాటి నిర్వహణ పనులను త్వరితగతిన పూర్తిచేయకపోతే రానున్న వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడనుంది. కుళాయి కనెక్షన్ల ద్వారా ఇంటింటికీ రక్షిత నీరు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన జల జీవన్ మిషన్ పథకం నిధులను, జిల్లా పరిషత్ సాధారణ నిధులను, 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామీణ నీటి సరఫరా విభాగం సకాలంలో వినియోగించకపోవడంతో సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. వెరసి వేసవిలో గ్రామీణ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంకానుంది.

జిల్లాలోని 572 పంచాయతీల్లో 15.33 లక్షల జనాభా వుంది. తాగునీటి కోసం చేతిబోర్లు 16 వేలు, పిడబ్ల్యు పథకాలు 1850, సిపిడబ్ల్యు పథకాలు 28 వున్నాయి. జలజీవన్ మిషన్ కింద రూ.552 కోట్లతో 1615 పనులు పూర్తిచేయాల్సివుండగా ఇప్పటివరకు రూ.237 కోట్లు ఖర్చు చేసి 928 పనులు పూర్తిచేశారు. మిగిలిన 687 పనులు వివిధ దశల్లో వున్నాయి. హౌసింగ్ కాలనీల్లో 191 పనులు పూర్తిచేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లతో తాగునీటి సరఫరా చేసేందుకు మంజూరు చేసిన రూ.120 కోట్లలో 58 పనులకు రూ.23 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా 133 పనులు పూర్తిచేయాల్సివుంది. అత్యధిక హౌసింగ్ కాలనీల్లో తాగునీటి వనరులు అందుబాటులో లేవు. నీటి కోసం మహిళలు నడిచివెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా జలజీవన్ మిషన్ నిధులతో కుళాయి పనులు పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలోని 4.17 లక్షల కుటుంబాల్లో ఇప్పటివరకు 2.64 లక్షల కుటుంబాలకు మాత్రమే ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. మంచి నీటి పథకాల నిర్వహణ పనుల నిమిత్తం కేటాయించిన జిల్లా పరిషత్ సాధారణ నిధులను సక్రమంగా వినియోగించడంలేదు. ఎంపీ లాడ్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు సరిగా ఉపయోగించకపోవడంతో పథకాల మరమ్మతులు జరగక తాగునీటి ఇబ్బందులను ప్రజలు ఎదుర్కోవాల్సివస్తోంది. 2023-24లో 12 పథకాల నిర్వహణకు మంజూరు చేసిన రూ.20.35 లక్షలలో తొమ్మిది పనులు పూర్తిచేశారు. రెండు పనులు జరుగుతుండగా, ఇంతవరకు ఒక పనిని ప్రారంభించలేదు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 32 పనుల కోసం రూ.59.88 లక్షలు మంజూరు చేయగా, ఎనిమిది పనులు మిగతా 2లో..

మాట్లాడుతున్న డిజిపి హరీష్ కుమార్ గుప్తా

సమర్థవంతంగా పనిచేయండి

క్రైమ్ రేట్ పెరిగితే ఉపేక్షించం
డిజిపి హరీష్ కుమార్ గుప్తా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని పోలీసు యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశించారు. ఆదివారం సాయంత్రం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో సిపి శంఖబ్రత బాగ్చి విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో చేపడుతున్న పోలీసింగ్ విధానాన్ని, లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ విభాగాల పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ విశాఖ నగరంలో పోలీసింగ్ మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, నగరంలో క్రైమ్ రేట్ పెరిగితే ఉపేక్షించేది లేదని అన్నారు. డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల రవాణా వినియోగంపై ఉక్కు పాదం మోపాలని, నగరంలో రౌడీయిజానికి తావు లేకుండా చూడాలని సూచించారు అధికారుల నుంచి ఏమైనా గ్రీవెన్స్ ఉంటే తనకు అందజేయాలని, వాటికి త్వరలోనే పరిష్కారం చూపిస్తామని అన్నారు.

బీచ్ రోడ్డులో ఆక్రమణలపై కొనసాగిన సర్వే
▶ వార్త 2లో..

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు
▶ వార్త 3లో..

కార్మికుల ఉపాధి జోలికొస్తే పోరాటం
▶ వార్త 4లో..

నామినేషన్లకు నేడే ఆఖరి రోజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు సమర్పించడానికి సోమవారం ఆఖరి రోజు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం ఉంది. మొదట రోజున ఏ ఒక్కరూ నామినేషన్ వేయలేదు. 4వ తేదీన ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా, 6వ తేదీన ఒకరు, 7వ తేదీన నలుగురు నామినేషన్లు వేశారు. నామినేషన్లు సమర్పించడానికి ఆఖరి రోజైన సోమవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామపత్రాలను స్వీకరిస్తారు. ఇంతవరకూ నామినేషన్లు సమర్పించిన వారిలో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, ఎపిటిఎఫ్ బలపరిచిన, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన, పిఆర్‌టియు మద్దతుతో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులు నాయుడు ఉండగా, స్వతంత్రులుగా కోసూరు రామకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, నూకల సూర్యప్రకాష్ ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ రెండు సెట్లు నామినేషన్లు సమర్పించారు.

నేడు ఓటర్ల తుది జాబితా ప్రకటన

ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా ఈసరికే సిద్ధమైంది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొత్తం 21,555 మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం ఓటర్లుగా నమోదు కావడానికి నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసిన రోజు వరకు ఉంది. దీంతో 1300 మంది ఓటు కోసం దరఖాస్తులు సమర్పించారు. ఈ దరఖాస్తులను ఉత్తరాంధ్రలోని ఆయా జిల్లాలకు పరిశీలన కోసం పంపారు. అర్హులైన ఓటర్ల వివరాలను నివేదిక రూపంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించి, తుది రూపం ఇచ్చి, సోమవారం ప్రకటించనున్నారు. దీంతో మొత్తం ఓటర్లు అసలు సంఖ్య ఎంతనేది స్పష్టం కానుంది.

కంది పప్పు ఎప్పుడొస్తుందో ?

కూటమి అధికారంలోకి వచ్చాక ఇచ్చింది రెండు సార్లే..!

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెల్లరేషన్ కార్డుదారులకు ఒక్కొక్క కార్డుకు కిలో చొప్పున రూ.67కి అందించే కందిపప్పును ఫిబ్రవరి మాసంలో నేటి వరకూ ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. సంబంధిత అధికారులు దీని గురించి స్పందించి ప్రకటన చేయలేదు. అయితే ఈ నెలలో రేషన్ కార్డులపై కందిపప్పు ఇవ్వడం లేదని ,తెలిసింది. రేషన్ డిపోల డీలర్లు, ఇంటింటికీ డోర్ డెలివరీ పేరుతో రేషన్ సరుకులను అందజేస్తున్న వాహనాల నిర్వాహకులు పలువురు ఇదే విషయాన్ని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో దాదాపు కందిపప్పు అనే మాటను రేషన్ కార్డు ఉన్న వారంతా మరిచిపోయారు. అయితే, ఎన్నికల సమయంలో మాత్రం కూటమి నాయకులు రేషన్ సరుకులను ఒకటి, రెండు కాకుండా కందిపప్పుతో సహా మిగిలిన సరుకులనూ అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఉన్నప్పుడు ఇస్తున్న

బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు ఇచ్చే ప్రయత్నం చేశారు. నగరంలో అక్టోబర్ మాసంలో కిలో రూ.67కి కందిపప్పు అందించారు. మరోసారి జనవరి మాసంలో ఇచ్చారు. ఈ నెల పూర్తిగా ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 మాసాలు పూర్తి కాగా కేవలం రెండు నెలలు మాత్రమే కందిపప్పు అందించారు. మార్చి నెలలో కందిపప్పు ఇస్తారా ? లేదా ? అనేది స్పష్టత రాలేదు. దీంతో కందిపప్పు పంపిణీ మూన్నాళ్ల ముచ్చట అని ప్రజలు అప్పుడే విమర్శలు చేస్తున్నారు. ప్రస్తుతం అర్బన్ డిఎస్ఒ పరిధిలో విశాఖ నగరంతో పాటు ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలు ఉన్నాయి. 5,12,619 తెలుపు కార్డులతో పాటు 625 చౌక ధరల డిపోలు ఉన్నాయి. ఒక జిల్లా సప్లయి అధికారి

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తాగునీటి పథకాలపై శ్రద్ధేదీ..?

పూర్తికాగా 14 పనులింకా కొనసాగుతున్నాయి. పది పనులు మొదలుపెట్టలేదు. ఎంపీ ల్యాడ్స్ కింద కోటీ 68 లక్షలతో 55 పనులు చేపట్టాల్సివుండగా వీటిలో 47 పూర్తిచేశారు. ఎనిమిది పనులు ప్రారంభించలేదు. 2023-24లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.86 కోట్లతో చేపట్టాల్సిన 231 పనుల్లో రూ.71.69 లక్షలు ఖర్చు చేసి 143 పనులు పూర్తిచేయగా, మరో 16 పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. 2023-24లో 72, 2024-25లో 88 పనులను ప్రారంభించలేదు. 2024-25లో ఆర్థిక సంఘం నిధులు ఐదు కోట్లతో 245 పనులు పూర్తిచేయాల్సివుంది. కానీ వీటిని కూడా సకాలంలో పూర్తిచేయలేదు. వేసవి సమీపిస్తుండడంతో తాగునీటి వనరుల పనితీరుపై సమీక్షించి మరమ్మతులు చేపట్టకపోతే ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తనున్నాయి.

కంది పప్పు ఎప్పుడొస్తుందో ?

(డిఎస్ఒ) ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ సప్లయి ఆఫీసర్లు (ఎఎస్ఒలు)తో కలిపి 21 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహశీల్దార్లు (సిఎస్‌డిటి) ఈ విభాగంలో పనిచేస్తున్నారు. జిల్లాలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం 310 డిఎంఇ వాహనాలను ఉపయోగిస్తున్నారు. రెండు, మూడు రేషన్ డిపోలకు కలిపి వాహనాల ద్వారా సరకులు అందిస్తున్నారు.

పెరిగిన ధరలతో విలవిల

ప్రస్తుతం మార్కెట్‌లో కందిపప్పు రూ.160 నుంచి రూ.180 పలుకుతోంది. ఇంత ఖరీదుతో కందిపప్పు కొనుగోలు చేసి తినే పరిస్థితి పేదలకు లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కందిపప్పుకు మంచి గిరాకీ ఉంది. జిల్లాలోని 5,12,619 తెలుపు కార్డుదారుల కోసం నెలకు 512 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. అక్టోబర్‌లో 30 టన్నుల కందిపప్పు విడుదల కాగా రేషన్ డిపోకు వంద కిలోల చొప్పున కొన్ని డిపోలకు కేటాయించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో జనవరిలో కందిపప్పు అందించారు. ఫిబ్రవరిలో మళ్లీ పంపిణీ నిలిపివేయడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా రేషన్ డిపోలో, వాహనాలలో కిలో కందిపప్పు ధర రూ.67కాగా కొన్నిచోట్ల రూ.70 వసూలు చేస్తున్నారు. అలాగే పంచదార ఒక్కొక్క కార్డుపై అరకిలో చొప్పున రూ.17కి ఇవ్వాల్సి ఉండగా రూ.20 చొప్పున వసూలు చేస్తూ చిలకకొట్టుడు వ్యవహారాలు చేసున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఎవరైనా అడిగితే చిల్లర సమస్య అంటున్నారు.

బురద జల్లడం సరికాదు

1/70కి ఎప్పుడూ అనుకూలమే : సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ : ఈ నెల 8న సాక్షి దినపత్రికలో తన పేరుతో వచ్చిన కథనం తన ప్రమేయంతో రాసింది కాదని, దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిపిఎం 1/70కి ఎప్పుడూ అనుకూలమేనని, ఈ యాక్ట్ రక్షణకు పని చేస్తున్నామని తెలిపారు. మైదాన గిరిజన ప్రాంతాన్ని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని సిపిఎం చేపట్టిన పాదయాత్రలోనూ, లేటరైట్ తవ్వకాలకు జర్తా లక్ష్మణ్‌రావు, ఇతరుల పేరిట ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, తవ్వకాలు నిలిపివేయాలని జరిగిన నాటి పబ్లిక్ హియరింగ్‌లోనూ తాను ప్రత్యక్షంగా పాల్గొన్నానని అన్నారు. నేటికీ పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన, గిరిజనేతరుల మధ్య తగాదాలు సృష్టించడం తగదన్నారు. సాక్షిలో వచ్చిన కథనాన్ని ఉపయోగించుకొని సిపిఎంపై బురద జల్లడం సరికాదని హెచ్చరించారు. గిరిజనులు, గిరిజన పెద్దలు అర్థం చేసుకుని మెలగాలని కోరారు.

తునికాకు టెండర్లు పిలవాలి

ప్రజాశక్తి అల్లూరి జిల్లా : గిరిజనులకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం గుండాల కాలనీలో సోందే రామారావు అధ్యక్షతన ఎటపాక మండల పార్టీ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొప్పెన కిరణ్ మాట్లాడుతూ గిరిజనులకు రెండో ఆదాయ వనరుగా భావించే తునికాకు సేకరణకు టెండర్లను పిలిచి ప్రక్రియ పూర్తి చేయాలని, ప్రూనింగ్ త్వరగా చేపట్టాలని కోరారు. 2012 నుంచి పెండింగ్ లో ఉన్న తునికాకు బోనస్‌ను కార్మికులకు వెంటనే చెల్లించాలని కోరారు. సకాలంలో ప్రూనింగ్ చేపట్టకపోవడం వలన గిరిజనులకు ఆదాయ వనరుల తగ్గుతుందన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీ పై కూడా ఇది ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఐవి, మండల కార్యదర్శి కాకా అర్జున్, మండల కమిటీ సభ్యులు పులుసు బాలకృష్ణ, జి హరి, పొడియం రత్తమ్మ, జి హుస్సేన్ పాల్గొన్నారు.

260 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రాజమహేంద్రవరానికి చెందిన రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్య శాల అధ్వర్యంలో ఆదివారం రంపచోడవరం సిరిగిందలపాడులో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ తలారి సుబ్బరావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ సంపత్ కుమార్. పాల్గొని సుమారు 260మందికి వైద్య సేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు వీరిలో 74మందికి రక్తపరీక్షలు, 10మందికి థైరాయిడ్ పరీక్షలు, నలుగురికీ ఇసిజిలు, 13మందికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు.

58 మందికి ఉచిత కంటి పరీక్షలు

వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వరంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి, 58మందికి నేత్రపరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న ఎనిమిది మందికి కళ్లజోళ్లు అందించారు.

బీచ్ రోడ్డులో ఆక్రమణలపై కొనసాగిన సర్వే

12లోగా కలెక్టర్‌కు నివేదిక

ప్రజాశక్తి - భీమునిపట్నం : సిఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా స్థానిక బీచ్ రోడ్డులో ఆక్రమణలు జరిగాయని, సంబంధిత వివరాలను న్యాయస్థానానికి తెలియజేయాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు జివిఎంసి, కాలుష్య నియంత్రణ మండలి, సిఆర్‌జెడ్ అధికారులు రెండో రోజైన ఆదివారమూ పలు ప్రాంతాల్లో సర్వే జరిపారు. పరిశీలన పూర్తయ్యాక సంబంధిత నివేదికను బుధవారం నాటికి హైకోర్టుకు వారు సమర్పించాల్సి ఉంది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు గతంలో వైసిపి మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అక్రమించినట్టుగా చెప్పబడుతున్న స్థలంలో ఇప్పటికే ప్రహరీని జివిఎంసి అధికారులు పాక్షికంగా కూల్చివేశారు. అదే ప్రాంతంతో పాటు తీరం వెంబడి వెలసిన ఎస్ఒఎస్ కూడలి వద్ద శ్మశాన వాటికకు ఆనుకుని నిర్మించిన ఓ రెస్టారెంట్, కొబ్బరి తోట పార్కు, పక్కనే ఉన్న తీరం రిసార్ట్, పలు రెస్టోబార్ ప్రాంతాల్లో బృందం సర్వే చేపట్టింది. సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి జరిపిన ఆక్రమణలపై తుది నివేదికను ఈ నెల 12లోగా కలెక్టర్‌కు ఇవ్వనున్నట్టు అధికారులు చెబుతున్నారు. జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్ఎస్.వర్మ, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి కె.హరిదాసు, మండల తహశీల్దార్ పైలా రామారావు, జివిఎంసి ఒకటో జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ తదితరులు తాజా సర్వేలో పాల్గొన్నారు

పరిశీలనకు వెళ్తున్న అధికారులు

'సాధుమంజీరాలు' ఆవిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - విశాఖపట్నం : అమరావతి విశ్వసాహితి ఆధ్వర్యంలో పిఎల్‌వి.ప్రసాద్ రచించిన 'సాధుమంజీరాలు' త్రిశతి పద్యకృతి ఆవిష్కరణ కార్యక్రమం విశాఖ నగరంలో ఆదివారం ఘనంగా సాగింది. రొంగలి రాములు స్వాగతోపన్యాసం చేయగా వందేమాతరం శ్రీనివాసరావు ప్రార్థనతో సభ ప్రారంభమైంది. సభాధ్యక్షులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పద్యం గొప్పతనాన్ని వివరించారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్త, విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రతిని వేగి సత్యనారాయణ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డివి.సూర్యారావు మాట్లాడుతూ అమరావతి విశ్వసాహితి సేవలను కొనియాడారు. శతక చరిత్రను విశ్లేషించారు. పియల్‌వి.ప్రసాద్ సాహితీ కృషిని అభినందించారు. సమాజానికి శతకాల అవసరం ఉందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ పుస్తక సమీక్ష చేస్తూ.. కొన్ని పద్యాలను చదివి, విశ్లేషించి, పాడి వినిపించారు. ముఖ్య అతిథి పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రసాద్ కృషిని మెచ్చుకున్నారు. తెలుగు భాషలో పద్యం గొప్పతనాన్ని వివరించారు. కవి ప్రసాద్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ హయాంలో విధ్వంస పాలన

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జగన్ హయాంలో ఎపిలో విధ్వంస పాలన సాగిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. కాంగ్రెస్ దక్షిణ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వాసుపల్లి సంతోష్ కుమార్ ఆదివారం బిజెపిలో చేరారు. బిజెపి విశాఖ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీలో పార్టీ గెలుపుపై ఆనందం వ్యక్తం చేశారు. ఢిల్లీలో మద్యం స్కాం మాదిరిగా రాష్ట్రంలో కూడా గత ప్రభుత్వ హయాంలో స్కాం జరిగిందని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను లాభాలతో నడిపించే బాధ్యతను కేంద్రం తీసుకుందన్నారు. పోలవరం నిర్మాణానికి సహాయం చేస్తోందని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా బ్రిటిష్ కాలంలో పెట్టిన వాల్తేర్ డివిజన్‌ను విశాఖపట్నం డివిజన్‌గా మార్చామని తెలిపారు. మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా కెకె.లైన్, అరకు రైల్వే స్టేషన్ సమస్యను ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అరకు రైల్వే స్టేషన్‌నును వదులుకునే పరిస్థితి లేదని, విశాఖ డివిజన్‌లో కొనసాగించే విధంగా ప్రయత్నం చేస్తామని అన్నారు. పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ జగన్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సెయిల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు ఎంఎంఎన్.పరశురామ రాజు, జిల్లా కార్యదర్శి దానేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పురంధరేశ్వరి

IN THE HON'BLE COURT OF III ADDL. JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.A.683/2022 in I.A.684/2022 in I.A.685/2022 in O.S.450/2018

Between:
Mohammed Rafi ...Petitioner/Plaintiff
And
Shaik Ibrahim & others
...Respondents/Defendants

NOTICE

To,
R-5: MEHRUN, W/o. Akbar Basha, Muslim, Aged 42 years, R/at Abus Sarang Veedhi, Old Post Office, Visakhapatnam.

The above-named petitioner filed the above suit/petition against you for grant of injunction, restraining the respondent, there men, agents and whoever acts on their behalf from interfering with the peaceful possession and enjoyment of the suit schedule property, etc. The above suit/petition stands posted to **11-02-2025** at **10:30 A.M.**, for your appearance before the Hon'ble court. You are hereby informed to attend before the above court on the said date with relevant records either yourself in person or through an advocate duly instructed by you. Failing which the matter will be decided according as per the material available in your absence.

(By Order of the Hon'ble Court)
SABBAVARAPU SATISH BABU
S.BALAKRISHNA
A.D. PRASANTHI,
Advocates, Visakhapatnam.

నేడు పరీక్ష పే చర్చ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం సోమవారం టివి, ఐఎఫ్‌పి ప్రాజెక్ట్, ఇతర ప్రసార మాధ్యమాల ద్వారా ప్రధాన మంత్రితో పరీక్ష పే చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ ఎ.జ్యోతికుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఈ మేరకు ఏర్పాట్లుచేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమం అనంతరం వీక్షించిన విద్యార్థుల సంఖ్య, ఛాయా చిత్రాలు ఎస్‌సిఇఆర్‌టి ప్రత్యేక లింక్‌లో అప్ లోడ్ చేయాలని తెలిపారు.

గీతం 'బై ది బే 2025'

ప్రజాశక్తి -మధురవాడ : గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక బీచ్ రోడ్డులో 'బై ది బే 2025' ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భవిష్యత్ ఆర్కిటెక్ట్‌ను ప్రేరేపించడానికి, యువతలో సృజనాత్మకతను పెంపొందించడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో భాగంగా గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ తరగతి గదుల నుంచి బయటకు వచ్చి బహిరంగ ప్రదేశంలో కూర్చుని కేన్వాస్‌పై ఆర్కిటెక్చర్ నమూనాలను చిత్రించారు. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ డీన్ డాక్టర్ విభూతి సచ్దేవ్ మాట్లాడుతూ, సమాజంతో కలిసి పనిచేయడానికి, ఆర్కిటెక్చర్ పట్ల ఉన్న అభిరుచిని పంచుకోవడానికి కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

మజ్జి అప్పారావు విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామపంచాయతీలో ఆదివారం వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు సోదరుడు కీర్తిశేషులు మజ్జి అప్పారావు విగ్రహాన్ని భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అప్పారావు జ్ఞాపకార్థం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అప్పారావు లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శారద ప్రియాంక, బంక సత్యం, జెడ్‌పిటిసి సభ్యులు వెంకట్రావు, శ్రీను, గనిరెడ్డి శ్రీను, బిఆర్‌బి.నాయుడు, బి.మణిశంకర్‌నాయుడు, ఇల్లపు వెంకట్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 159 మందికి వైద్యులు ఎ.రుచిత, బి.వివేక్, సిబ్బంది నేత్ర వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 55 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. 37 మందికి త్వరలో కళ్ల జోళ్లు ఉచితంగా ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నీడి వెల్ఫేర్ అసోసియేషన్, సన్ స్కూల్ సంయుక్తాధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాస్, స్థానికులు గంటా నూకరాజు, ఎ.సూర్యశ్రీనివాస్, బసవ కృష్ణమూర్తి, వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడుంటామని ప్రతిజ్ఞ చేసుకున్నారు. కంది అప్పలరాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సతీష్, ధనియాల రమేష్, గొర్లె శ్రీను పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలుచేయండి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర రెడ్డి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కూటమి ప్రభుత్వాన్ని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భీమిలిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో జివిఎంసి రెండో వార్డు వైసిపి అధ్యక్షులు ఎస్.కరుణాకరరెడ్డి మాట్లాడుతూ, మూడు పార్టీలు జత కట్టి గత ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ సింగిల్‌గా ఎన్నికల బరిలో నిలిచిన వైసిపికి 40 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, మూడో వార్డు వైసిపి అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు మాట్లాడుతూ, మత్స్యకార భరోసా పథకం కింద నేటికీ సాయం అందించలేదని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ, వాసుపల్లి కొండబాబు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కోండ్రు రామసూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు నిధులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం బాలికల వసతి గృహం సమీపంలో సర్వే నెంబరు 276లో సుమారు 5 ఎకరాల స్థలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రూ.5 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. తగరపువలస కస్తూరిబా బాలిక విద్యాలయం హాస్టల్ భవనంలో తాత్కాలికంగా నడుస్తున్న డిగ్రీ కాలేజీ భవన నిర్మాణానికి పిఎం యుఎస్ హెచ్‌వి ఆర్ యు ఎస్‌ఎ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మరికొన్ని రోజుల్లో ఈ నిధులు మురిగిపోయే పరిస్థితి వచ్చిందని వివరించారు. దీంతో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆనందపురం హైస్కూల్ పక్కనే ఉన్న 5 ఎకరాల భూమిని డిగ్రీ కాలేజీ కోసం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కలెక్టర్ స్పందించి భూమిని వెంటనే కేటాయించారని, భవన నిర్మాణ పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన డిగ్రీ కాలేజీని విద్యార్థులకు అందజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

పొగమంచుతో మామిడి పూతకు దెబ్బ

ప్రజాశక్తి -పద్మనాభం : పొగ, తేనెమంచు దెబ్బకు మాడిపోతున్న మామిడి పూతను కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చేపడుతున్నారు. గడచిన రెండుమూడేళ్లతో పోలిస్తే ఈ ఏడాది మామిడిపూత ఆశాజనకంగా, ఎక్కువగానే వచ్చిందని, అయితే పొగమంచు ప్రభావంతో మామిడిపూత నల్లగా మాడిపోయి పాడౌతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొగమంచు దెబ్బకు పూత రాలిపోకుండా ఉండేందుకు చెట్టు చివరి నుండి మొదలువరకు బాగా తడిచేటట్లు ట్రాక్టర్ ట్యాంకర్లతో మందు ద్రావణం పిచికారి చేస్తున్నారు. మండలంలో కొవ్వాడ, గంధవరం, అనంతవరం, బాందేవిపురం, రెడ్డిపల్లి, పొట్నూరు, తునివలస నర్సాపురం, చిన్నాపురం, కొయ్యిపేట, బిఆర్ తాళ్లవలస, అయినాడ, బచ్చపేట, గద్దపేట, కోరాడ వెంకటాపురం, కొరపల్లి గ్రామాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి ఆయా తోటల్లో మామిడి చెట్లు విస్తారంగాపూత పూసినప్పటికీ, మంచు దెబ్బతో అవి పాడవుతుండడంతో మామిడి తోటల్లో పూత నిలవడం కోసం విస్తారంగా సస్యరక్షణ పనులు చేపడుతున్నారు.

రక్తదాన శిబిరాలు

పెద్దిపాలెంలో రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు పరిధి జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో సురభి క్లినిక్ ఆధ్వర్యాన విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ, సురభి క్లినిక్ సేవలను కొనియాడారు. మురికివాడలో ఉన్న ప్రజలకు ఓపి లేకుండా చూడాలని కోరారు. అనంతరం డాక్టర్ జివిఎస్.రాము మాట్లాడుతూ, ఇటువంటి ప్రాంతంలోని ప్రజలు తమ క్లినిక్‌కు వస్తే ఉచితంగానే సేవలందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీమాధవి, ఎ.సన్యాసిరావు, తారకేశ్వర సూర్యప్రకాష్, అఖిల్, భార్గవ, వంశీ, అప్పలరాజు, కృష్ణ, విశ్వేశ్వరరావు, ఆకుల గణేష్, ఎంజె.సాయి తదితరులు పాల్గొన్నారు.

90 మంది రక్తదానం

భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్గశ్రీ దేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన కలిగొట్ల శ్రీదేవి జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఫౌండేషన్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. వైజాగ్ బ్లడ్ బ్యాంక్, విజయనగరానికి చెందిన విజయ బ్లడ్ బ్యాంక్ సహకారంతో, వైద్యులు సోనియా, ఆదిత్య పర్యవేక్షణలో 90 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఒక్కో రక్తదాతకు ఫౌండేషన్ పరంగా రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెల్లించినట్లు ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.సూర్యనారాయణమూర్తి, కె.బానోజీరావు, శ్రీనివాసరావు, సి.హెచ్.బాలకృష్ణ, వి.తాతాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత రక్త దాన శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ ప్రారంభించారు.

పెద్దిపాలెంలో రక్తదానం

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో మరుపిళ్ల బంగారు నాయుడు(బాబ్జి) జయంతి సందర్భంగా రక్త దాన శిబిరం, క్రికెట్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు బాలకృష్ణ పర్యవేక్షణలో, ఓఎస్జీ ఫౌండేషన్ ఆధ్వర్యాన యువ క్రికెట్ క్రీడాకారులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీ వరకు క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు టిడిపి యువత కార్యనిర్వాహక కార్యదర్శి మరుపిళ్ల సాయి జ్ఞానేశ్వర్ తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.12 వేలు, 8 వేలు, రూ.5 వేలు నిర్ణయించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్జీ వ్యవస్థాపకులు శివదలాయి, రోహిత్, శవేశ్ తరుణ్, సాయికిరణ్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

వాడపాలెం బీచ్‌లో..

ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థుల గల్లంతు

ఒకరు మృతి - మరొకరి కోసం గాలింపు

ప్రజాశక్తి - రాంబిల్లి : మండలంలోని రాంబిల్లి శివారు వాడపాలెం బీచ్‌లో ఆదివారం ఇద్దరూ ఇంజినీరింగ్ విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. ఈ విషాద సంఘటనకు సంబంధించిన రాంబిల్లి పోలీసులు ఇచ్చిన వివరాలివి. వాడపాలెం బీచ్‌కు తగరపువలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థి మొక్క సూర్య తేజ(17), అలాగే దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి మొక్క పవన్ తేజ (17) వచ్చారు. బీచ్‌లో ఆడుతుండగా, ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతయ్యారు సూర్యతేజ మృతదేహం లభ్యం కాగా, పవన్ కోసం గాలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సూర్య తేజ ది విశాఖ కంచరపాలెం లోని ఇంద్రానగర్ కాగా, పవన్ తేజది దువ్వాడలోని సంధ్యా నగర్.. సంఘటన స్థలాన్ని డిఎస్‌పి సత్యనారాయణ సందర్శించారు. రాంబిల్లి సీఐ నర్సింగరావు, ఎస్ఐ నాగేంద్ర ఉన్నారు.

ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని ఎ.ఎస్.పేట గ్రామ శివారులో గుళ్లాట ఆడిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు. ఆదివారం వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి, ఆరుగుళ్లతోపాటు, నెంబరు పట్టా, రూ.620 నగదును స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గెడ్డ ఆక్రమణ

ప్రజాశక్తి -ఆనందపురం : గంభీరం పంచాయతీ బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో గెడ్డను ఆక్రమించి అక్రమ కట్టడాలు చేపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆనుకొని సర్వే నెంబరు 173లోని గెడ్డవాగును సుమారు 8 సెంట్లు స్థలంలో చదును చేసి పక్కా నిర్మాణాలకు పునాదులు తవ్వారు. ముందుగా మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాన్ని కూడా ఆక్రమించడంతో భవిష్యత్తులో ఎలాంటి పనులు చేయడానికి వీలు లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వ స్థలంతో పాటు గెడ్డను కూడా ఆక్రమించడం వల్ల వర్షాలు వస్తే నీరు పోయే మార్గం ఉండక భవిష్యత్తులో పలు ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి గెడ్డలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం

అలరించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో ఆదివారం సిద్ధేంద్ర యోగి నాట్యాలయం ఆధ్వర్యాన నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, రంగనికిణ్యం, హరహరహరే, ముద్దుగారే యశోద, జగద నంద కారక, జగదపు చనవుల జాతర వంటి గేయాలకు చరిష్మా, జాస్విక, సోపిక, మన్విత, మశ్విత, నవ్య, గుశ్వీక, పావని, మోక్షిత, తన్మయి నృత్య ప్రదర్శనలిచ్చారు.

కార్మికుల ఉపాధి జోలికొస్తే పోరాటం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -ఉక్కునగరం : కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే పోరాటం తీవ్రతరం చేస్తామని ఉక్కు యాజమాన్యాన్ని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 ఏళ్లుగా ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని చూడడం దుర్మార్గం అన్నారు. ఓ వైపు పర్మినెంటు కార్మికులకు విఆర్ఎస్ ఇచ్చి పంపించి, మరో వైపు కాంట్రాక్టు కార్మికులను తగ్గించేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే కుట్ర ఉందని ఆరోపించారు. ఉత్పత్తిని పెంచి నిర్వాసితులకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్‌చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు కార్మికులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులందరూ మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెఎం.శ్రీనివాసరావు. నమ్మి రమణ, యు.సోమేష్, ఎన్.శశిభూషణ్, ఎన్.కృష్ణ, వివి.రమణ, చట్టి నర్సింగరావు, పి.నారాయణ, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

గెడ్డ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గెడ్డ కాలువ పనుల పరిశీలన

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామంలో రూ.2 కోట్ల జివిఎంసి నిధులతో జరుగుతున్న గెడ్డ కాలువ పనులను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. కాలువ నిర్మాణ పనులను, డెయిరీ కాలనీ వద్దా పరిశీలించి తగు సూచనలు చేశారు. భవిష్యత్తులో లోతట్టు ప్రాంతాలకు ఎటువంటి ముప్పు లేకుండా తగిన రీతిలో నిర్మాణం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, టిడిపి సీనియర్ నాయకులు తాటికొండ సుదర్శన్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేసిన సుమన్

ముగిసిన కరాటే పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు స్టేడియం వేదికగా ఈ నెల 6 నుంచి జరుగుతున్న రెండో అంతర్జాతీయ కరాటే పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో దేశ, విదేశాలకు చెందిన 1200 మంది క్రీడాకారులు పాల్గొని తమ సత్తా చాటారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సుమన్ హాజరై మాట్లాడుతూ, విశాఖలో రెండోసారి కూడా అంతర్జాతీయ కరాటే పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిలిచిందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినట్లు సుమన్ కొనియాడారు. గౌరవ అతిథి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, అంతర్జాతీయ కరాటే పోటీలు నిర్వహించడం వల్ల విశాఖ పేరు ప్రతిష్టలు పెరిగాయన్నారు. హైపవర్ కప్ టోర్నీ పేరిట నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. పోటీల నిర్వహణకు ఎస్‌పిఎండి.నాయుడు బృందం చేసిన ఏర్పాట్లను దేశ విదేశాల క్రీడాకారులు, కోచ్‌లు అభినందించారు. ప్రముఖ రిఫరీ వి.రవీంద్రకుమార్, ఆర్గనైజర్లు ఎస్.కిషోర్‌కుమార్, కె.హేమంత్, ఎం.సుందరం, ఎస్.వంశీకృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ హక్కుతో ఇంటి స్థలాలను కేటాయించాలి

ప్రజాశక్తి -గాజువాక : అర్హులైన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పిస్తూ ,ఇంటి స్థలాలను కేటాయించాలని సిపిఐ గాజువాక నియోజకవర్గ సమితి డిమాండ్ చేసింది. సంజీవగిరి కాలనీ ఏరియాలో సిపిఐ ఆధ్వర్యాన అర్హులైన లబ్ధిదారుల నుంచి ఆదివారం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, లబ్ధిదారులకు పట్టాలు కేటాయించినప్పటికీ ఇంతవరకు ఇంటి స్థలాలు అప్పగించలేదన్నారు. ఇంటి పట్టాలు అందుకున్న వారందరికీ తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకొనే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. టిడ్కో గృహ లబ్ధిదారులకు మంచి నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల అలాట్‌మెంట్ చేయకుండానే బ్యాంక్‌ల నుంచి వడ్డీ కట్టమని ఒత్తిడి పెరిగిందన్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని, లేకుంటే బుధవారం నుంచి రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కె.అచ్యుతరావు, జి.ఆనంద్, పెదపూడి దుర్గారావు, శివ, మహిళా సమాఖ్య నేతలు కె.వనజాక్షి, పిల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు దరఖాస్తుల స్వీకరణలో పాల్గొన్న సిపిఐ నాయకులు

కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా జయగోపాల్ రచనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సమాజంలోని కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా డాక్టర్ జయగోపాల్ ఉద్యమించడమే కాకుండా అనేక రచనలు చేశారని చిత్తజల్లు వరహాలరాజు (సీవీ) తనయుడు ఉదయ భాస్కర్ తెలిపారు. ప్రముఖ నాస్తికోద్యమ నేత, పెరియార్ అవార్డు గ్రహీత డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి సభ స్థానిక పౌర గ్రంథాలయంలో భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. జయగోపాల్ చిత్రపటానికి అతిథులు, వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ, రామ మందిరం-బాబ్రీ మసీద్ అంశంపై 2వేల పుస్తకాలు వేయడంలో జయగోపాల్ సహకారం మరువలేనిదని తెలిపారు. జయగోపాల్ ఆశయ సాధనకు సతీమణి శారద సహకారం అందించేవారని పేర్కొన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ.రమణమూర్తి మాట్లాడుతూ, దేశ ప్రజలను మూఢనమ్మకాల నుంచి జాగృతం చేయడంలో జయగోపాల్ పోషించిన పాత్ర అనిర్వచనీయమన్నారు. పెరియర్ ద్వారా ప్రభావితమై, మతన్మాద శక్తులపై జీవితాంతం పోరాడారన్నారు. ఆనాడు జయ గోపాల్ చెప్పినట్టే నేడు మతం పిచ్చిలోకి ప్రజలను నెట్టి పాలకులు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. జయగోపాల్ రచనలు పిల్లలకు పాఠ్యాంశాలుగా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని జయ గోపాల్ ఆలోచన చేసేవారని, స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, జె.రవి, కేంద్ర కమిటీ నాయకులు సాయి నరేందర్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ నాయకులు వేదాంత మోర్య, వై.నూకరాజు, కొత్తపల్లి వెంకటరమణ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, భీమ్‌సేన్ నాయకులు రవి సిద్ధార్థ, జె.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి

రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావులకు డాక్టరేట్లు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ అమెరికన్ అక్రెడిటేషన్ అఫిలియేషన్ ఆధ్వర్యాన ఆదివారం పౌర గ్రంథాలయంలో సోషల్ యాక్టివిటీస్‌లో ఉత్తమ పనితీరు కనబరిచిన సందర్భంగా డాక్టర్ నేతల రాజ్యలక్ష్మి, బి.శ్రీనివాసరావుకు డాక్టరేట్లు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ఉద్యోగం చేస్తూ పదిమందికి ఉపయోగపడాలనే ఆలోచనతో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సేవలకు డాక్టరేట్ రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ గ్లోబల్ పీస్ యూనివర్సిటీ సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మెదడులో అధిక విద్యుత్ ఉత్పత్తితో ఫిట్స్

కిమ్స్ ఐకాన్ న్యూరాలజిస్టు విజయ్

ప్రజాశక్తి -గాజువాక : మెదడులోని ఒక భాగంలో అవసరానికి మించి విద్యుత్ ఉత్పత్తి అవడం వల్ల ఫిట్స్ వస్తాయని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సిహెచ్.విజయ్ తెలిపారు. ఇలా ఉత్పత్తి అయిన విద్యుత్ ఏ భాగం నుంచి ఎక్కడికి వస్తుందనేదాన్ని బట్టి రోగికి లక్షణాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మెదడు ఎదుగుదలలో లోపం ఇంకో కారణం కావచ్చని తెలిపారు. కొంత మందిలో ఒక భాగంలో లేదా రెండు నుంచి మూడు మిల్లీ మీటర్లు లేదా సెంటీమీటర్ భాగంలో ఫిట్స్ ఉండొచ్చని, కొన్నిసార్లు మెదడు అర్ధభాగం లేదా మొత్తం మెదడులో అసాధరణ పరిస్థితి తలెత్తవచ్చని వివరించారు. పిల్లల్లో వచ్చే నియంత్రించలేని ఫిట్స్‌కు ఇదొక కారణమని తెలిపారు. ఈ సమస్య ఉన్న 100 మందిలో 70 మందికి మందులతో తగ్గదని పేర్కొన్నారు. పెద్దవారిలో ఫిట్స్‌కు మెదడులోని కణితులు, ఇన్‌పెక్షన్స్ తదితరాలు కారణం కావచ్చని వివరించారు. చిన్నప్పుడు జ్వరంతో ఫిట్స్ వస్తే ఫెబ్రైల్ సీజర్స్ అంటారని, ఇవి సాధారణంగా 6 సంవత్సరాల తరువాత ఆగిపోతాయని తెలిపారు. వంద మంది ఫిట్స్ రోగులకు మందులతో చికిత్స చేస్తే 60 మందికి నియంత్రణలో ఉంటుందని పేర్కొన్నారు. మూడేళ్లు, ఐదేళ్లు మందులు వాడితే ఫిట్స్ తగ్గిపోతుందనే అపోహతో చాలామంది ఉన్నారని, వందలో 10 నుంచి 15 శాతం రోగుల్లో ఐదారేళ్లు మందులు వాడితే తగ్గే అవకాశముంటుందని వివరించారు. మిగతావారు జీవితాంతం మందులు వాడాల్సిందేనని స్పష్టంచేశారు. ఫిట్స్ తీవ్రతను తగ్గించడం మందుల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఐదేళ్ల తర్వాత ఫిట్స్ కంట్రోల్లో ఉంటే మందుల మోతాదును తగ్గించనున్నట్లు పేర్కొన్నారు. మందులు వల్ల తగ్గని ఫిట్స్ వ్యాధికి ఆపరేషన్ చేస్తారని తెలిపారు.

కోలాటం కర్రలు పంపిణీ చేస్తున్న సర్వసిద్ధి శ్రీలక్ష్మి

కోలాటం కర్రల వితరణ

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి మల్కాపురం యాదవవీధి జైశ్రీకృష్ణ కోలాటం గ్రూపు సభ్యులకు కోలాటం కర్రలను వార్డు టిడిపి మహిళా అధ్యక్షులు సర్వసిద్ధి శ్రీలక్ష్మి ఆర్థిక సహాయంతో అందజేశారు. ఈ సందర్భంగా సర్వసిద్ధి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, చిన్నారులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని సూచించారు. పిల్లలకు కోలాటంలో మంచి తర్ఫీదునిచ్చి, దేవస్థానాల వద్ద ప్రదర్శనలు ఇప్పిస్తున్న నూనెల లావణ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో లావణ్య, ఉరుకూటి పైడిరాజు పాల్గొన్నారు.

కెకె.లైన్‌ను విశాఖ డివిజన్‌లో ఉంచాలి

ప్రజాశక్తి- పెందుర్తి : పాత వాల్తేరు డివిజన్ మొత్తాన్ని, విశాఖ కేంద్రంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లోనే కొనసాగించాలని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వాల్తేరు డివిజన్‌ను ముక్కలు చేయడం సరి కాదన్నారు. ఉద్యోగుల రిక్రూట్ మెంటు బోర్డును విశాఖలోనే ఏర్పాటుచేయాలని, జోన్‌కు అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కెకె.లైను, అరకు మార్గం లేని సౌత్ కోస్టల్ జోన్ వల్ల ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాలకు తీవ్ర నష్టం అన్నారు. కెకె.లైన్ ద్వారానే సంవత్సరానికి రూ.10,500 కోట్ల ఆదాయం వస్తుందని వెల్లడించారు. అంతటి ప్రాధాన్యత కల కెకె.లైన్‌ను విశాఖ నుంచి తొలగించి రాయగడలో కలపడం విచారకరమని పేర్కొన్నారు. పెద్దగా ఆదాయం లేని విశాఖ రైల్వే జోన్‌లో భవిష్యత్తులో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం కూడా కష్టంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన అరకును రాయగడ జోన్‌లో కలపడం ద్వారా ఏపీకి తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వాలు పునరాలోచించి కెకె.లైను, అరకు రైలు మార్గాలను విశాఖ జోన్‌లో కొనసాగించాలని కోరారు.

ఫార్మా కార్మికునికి పరామర్శ

బాధితుడిని పరామర్శిస్తున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : సెజ్‌లోని క్రిస్టల్ ఫార్మా కెమికల్ పరిశ్రమలో రసాయనాలు లీకై తీవ్ర అస్వస్థతకు గురైన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. అచ్యుతాపురం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సుశీల్ ఓరియన్‌ను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఫార్మా పరిశ్రమలో ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్రమాద ఘటనలతో కార్మికుల జీవితాలు బలైపోయి, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు బాధ్యతారాహిత్యం, భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దంత సంరక్షణపై అవగాహన

డాక్టర్ శ్యాంసుందర్‌ను సత్కరిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : దంత సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు పాటించాలని దంత వైద్యులు డాక్టర్ శ్యాంసుందర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్లో వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో దంత సమస్యలు, నివారణోపాయాలు అనే అంశంపై మాట్లాడారు. నోటి చిగుర్లు, పుచ్చిపళ్ళు, దంత మార్పిడి, పళ్ళు బ్రష్‌తో ఎలా తోముకోవాలి, ఏ టూత్ పేస్ట్ వాడాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. దేశంలో కేన్సర్ బాధితుల సంఖ్య పెరిగిపోతోందని, 50ఏళు దాటిన వారంతా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. కార్యక్రమంలో వాకర్ అధ్యక్షులు రాపేటి నారాయణరావు, వై.శివ, కార్యదర్శి, కెవివి సత్యనారాయణ, కోశాధికారి, బి రామకష్ణ, డాక్టర్ డి డి నాయుడు, ఎస్ నూకరాజు, కెటీవీ సత్యనారాయణ, మస్తాన్ వలి, ఆడారి మల్లికార్జున రావు, నల్లల దేవుళ్ళు పాల్గొన్నారు. డాక్టర్ శ్యాంసుందర్‌ను సత్కరించారు.

చౌడువాడ పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు వెంకన్న పాత్రుడు మృతి

చిన్న దొర (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులుగా మూడు పర్యాయాలు పనిచేసిన బండారు వెంకన్న పాత్రుడు (చిన్న దొర) ఆదివారం మృతి చెందారు. డిసిసిబి డైరెక్టర్‌గా, డిసిఎంఎస్ డైరెక్టర్‌గా జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా రెండేసి పర్యాయాలు పనిచేసారు. ఎన్ని బాధ్యతలు నిర్వహించినా రాజకీయాలు, వివాదాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించి అజాతశత్రువుగా అందరి మన్ననలు పొందారు. వెంకన్న పాత్రుడు భార్య బండారు నారాయణమ్మ ఒక పర్యాయం కె.కోటపాడు జెడ్‌పిటిసిగా వ్యవహరించారు. చిన్నదొర మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.. వెంకన్న పాత్రుడుకు భార్య నారాయణమ్మ ఒక కుమారుడు కుమార్తె ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు.

పిడిఎఫ్ అభ్యర్థి

విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ్‌గౌరిని గెలిపించాలని కోరుతూ ఆదివారం ఉపాధ్యాయ, ప్రజా సంఘాల సభ్యులు మండలంలోని తుమ్మపాల, మిరియాల కాలనీ, చిన్న వీధి, వేల్పులవీధి, గవరపాలెం, నర్సింగ రావు పేట, తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్ళి ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలిసి కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేశారు. ఉపాధ్యాయ సమస్యలపై, హక్కులపై నికరంగా పోరాడే యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల విజయ గౌరిని గెలిపించాలని కోరారు. విజ్ఞప్తి చేశారు. గతంలోఇతర ఉపాధ్యాయసంఘాల నుంచి గెలిచిన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయుల సమస్యలను పక్కనపెట్టి అధికారపార్టీ ప్రభుత్వాలతో అంటకాగి, సొంత ప్రయోజనాల కోసం ఉపాధ్యాయుల హక్కులను తాకట్టుపెట్టారని,అటువంటి వారిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాజీలేని పోరాటాలు చేస్తున్నారని, వారికి మరింత బలం చేకూర్చేందుకు ఉత్తరాంధ్ర నియోజకవర్గం నుంచి టీచర్ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించాలని కోరారు.

ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు

ఉత్సాహంగా ఎన్‌టిపిసి సింహాద్రి ఆనంద్ మేళా

కేకు కట్ చేస్తున్న దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి- పరవాడ : పరవాడ ఎన్‌టిపిసి దీపాంజలి నగర్ సాధన క్రీడా మైదాన్‌లో ఆదివారం దీపికా లేడీస్ క్లబ్, ఎన్‌టిపిసి సింహాద్రి, వైబ్రెంట్ ఆనంద్ మేళా ఉత్సాహంగా సాగింది. శని, ఆదివారాల్లో 'ఏ ఫెయిర్ ఆఫ్ జాయ్ విత్ ఎ ఫ్యూజన్ ఆఫ్ కల్చర్ అండ్ కలర్స్' థీమ్‌తో నిర్వహించిన ఆనంద్‌మేళాను సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ వెంకట రవి రామ్ పిన్నింటి, మాజీ భద్రతా సలహాదారు, అతని జీవిత భాగస్వామి సమక్షంలో ప్రారంభించారు. అతిథులను సునీత పిన్నింటి, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు నీతా శర్మ స్వాగతించారు. భారతీయ వారసత్వాన్ని పరిరక్షించడం, సామాజిక సంక్షేమాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఎన్‌టిపిసి సింహాద్రి సిఎస్ఆర్‌లో భాగంగా ప్రతిభావంతులైన బాలికలకు సైకిళ్లను క్లబ్ ప్రతినిధులు పంపిణీ చేశారు. మేళాలో ప్రాంతీయ వంటకాలు, జానపద నృత్యాలు, సాంప్రదాయ కార్యకలాపాలతో సహ విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు, దేశ వారసత్వాన్ని ప్రతిబింబించాయి. . ఉత్సవాల్లో సమీపంలోని నివాసితులతో పాటు ఉద్యోగులు, సహచరులు, ుటుంబ సభ్యులు పాల్గొన్నారు. నిర్వాహకులను సింహాద్రి హెచ్ఒపి సమీర్ శర్మ, ప్రశంసించారు. కార్యక్రమంలో సింహాద్రి, సిపిజి 3 సీనియర్ అధికారులు, యూనియన్లు, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు,

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : అఖిల భారత పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు పి బాబూజీ, కాకినాడ డివిజనల్ కార్యదర్శి తురగా సూర్యారావు, సిహెచ్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎఐపిఆర్ పిఎ అనకాపల్లి డివిజన్ పదవ వార్షిక సమావేశం రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షులు సిహెచ్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత పెన్షన్ పద్ధతి తిరిగి అమలు చేయాలని, కరోనా కాలంలో నిలుపుదల చేసిన 18 నెలల డిఆర్ బకాయిలు తక్షణమే చెల్లించాలని, అమ్మిన పెన్షనును ప్రస్తుతం ఉన్నట్టు 15 ఏళ్లకు కాకుండా 12 సంవత్సరాలకు కుదించాలని, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సర్వీస్ సౌకర్యాలు మెరుగుపరచాలని, ఎన్‌పిఎస్ పెన్షనర్లకు సిజిహెచ్ఎస్, ఫిక్స్డ్ మెడికల్ అలవెన్స్ అమలు చేయాలని, ఏడాది సర్వీస్ పూర్తి చేసి 2006 తర్వాత జూన్ డిసెంబర్లో రిటైర్ అయిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, 80 సంవత్సరాలు రాగానే 20 శాతం అదనపు పింఛన్ మంజూరు చేయాలని, 65, 70, 75 సంవత్సరాలు రాగానే ఐదు శాతం, 10 శాతం, 15శాతం అదనపు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బాబూజీని సత్కరిస్తున్న పెన్షనర్లు

కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన రైల్వే రాయితీ పాసులు పునరుద్ధరించాలని కోరారు. ఎనిమిదవ వేతన సంఘం, కేంద్ర, రాష్ట్ర, డివిజనల్ సంఘాలు చేస్తున్న కార్యక్రమాలను, సంఘ నివేదికను కార్యదర్శి కె.రాజారావు వివరించారు. సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గంట శ్రీరామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు,ఉద్యోగస్తుల తరపున శాసనమండలిలో వారి సమస్యలను ప్రశ్నించేందుకు రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల విజయ గౌరీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజనల్ సంఘ కోశాధికారి టి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దళిత హక్కుల పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి- మునగపాక: దళిత హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేయాలని అంబేద్కరి జమే పునాది అసోసియేషన్ జిల్లా కన్వీనర్ రాజాన బుజ్జిబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌సి హాస్టల్‌లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశానికి అధ్యక్షతన వహించి, మాట్లాడుతూ ప్రతి దళిత కాలనీలోనూ అంబేద్కర్ పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని, దళిత విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంపొందించాలన్నారు. విద్య, ఉద్యోగ రాజకీయ హక్కులను కాపాడుకునేందుకు ఉమ్మడిగా పోరాడాలని పిలుప ునిచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులు గుంట్ల అప్పారావు మాట్లాడుతూ దళిత కాలనీలలో సంక్షేమం, అభివృద్ధి, దళిత చట్టాల పరిరక్షణకు చైతన్య యాత్రలు చేపట్టి, విద్యార్థులలో చైతన్యం తీసుకురావాలని కోరారు. పిట్ట అప్పారావు, లంబ అప్పారావు, ఎం విష్ణు, సూరప్పారావు, పిల్లి అప్పారావు, బిలా శివ గణేష్, దిమ్మల శివ, లంబా అర్జున్, అశోక్ కుమార్ ,గణపతి అప్పారావు, శేషుకుమార్, రమణబాబు, శాంత కుమార్ పాల్గొన్నారు.

కాటాల్లోనే ఎండిపోతున్న చెరుకు

ఆర్థికంగా నష్టపోతున్నామని రైతుల ఆవేదన

గుల్లేపల్లి కాటాలో నిలిచిన చెరకు ట్రాక్టర్లు

ప్రజాశక్తి- కె. కోటపాడు :గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెందిన కాటాల్లో వారం రోజులుగా చెరుకు పేరుకుపోతోంది. ఫ్యాక్టరీ గానుగాట ప్రారంభించిన కొద్దిరోజులకే మరమ్మతులకు గురికావడం, మరో వారం రోజుల్లో లారీల యజమానులు సమ్మె బాట పట్టడంతో కాటాల్లోనే చెరుకు ఎండిపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. మండలంలోని గుల్లేపల్లి, సూరెడ్డిపాలెం, ఎ.భీమవరం, మేడిచర్ల గ్రామాల్లో గోవాడ సుగర్స్‌కు చెందిన చెరుకు కాటాలు ఉన్నాయి. ఒక్క గుల్లేపల్లి చెరుకు కాటాలోనే 30కి పైగా ట్రాక్టర్లు చెరకులోడుతో నిలిచిపోయి ఉన్నాయి. వాటిని ఫ్యాక్టరీకి తరలించకపోవడంతో చెరకు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు ఫ్యాక్టరీ యాజమాన్యం చెరుకును సకాలంలో ఫ్యాక్టరీకి తరలించాలని, బాధిత రైతులకు నష్ట పరిహారం అందించాలని గోవాడ సుగర్స్ రైతులు కోరుతున్నారు.

బ్రాండిక్స్‌లో 390 మందికి కంటి పరీక్షలు

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న నేత్ర వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం :బ్రాండిక్స్ అపెరల్ సిటీ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 390 మందికి నేత్ర వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా కొనసాగిస్తున్న వైద్య శిబిరంలో 295 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించారు 156మందికి మందులు పంపిణీ చేశారు. 40 మంది కంటి రోగులకు క్యాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కంటి వైద్య శిబిరానికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు మజ్జిగ, భోజన సదుపాయం కల్పించారు.

అవార్డు గ్రహీతకు ఘన సత్కారం

ఉత్తమ విఒఎ అవార్డు అందుకున్న ఉషను సత్కరిస్తున్న సిఐటియు

ప్రజాశక్తి- అనకాపల్లి : సేంద్రీయ వ్యవసాయంలో శిక్షణ, ఉత్తమ ఫలితాన్ని సాధించి, అనకాపల్లి జిల్లా నుంచి ఢిల్లీలోని గణతంత్ర ఉత్సవాలకు ఆహ్వానితురాలిగా వెళ్లి అవార్డు అందుకున్న మునగపాక మండలం టి సిరసపల్లి విఒఎ పొలమరశెట్టి ఉషను ఆదివారం వెలుగు విఒఎలు, యానిమేటర్ల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సత్కరించారు. సిఐటియు కార్యాలయంలో విఒఎ సంఘం జిల్లా సమావేశంలో ఉషకు జాతీయస్థాయి అవార్డు దక్కడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆమె అంకితభావానికి ఈ అవార్డు నిదర్శనమని కొనియాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు, కోశాధికారి కె.లక్ష్మీ ప్రసన్న, వై లక్ష్మి ,వెంకటలక్ష్మి, త్రినాధ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

సహచర మిత్రుడికి సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన శ్రీకాకుళపు ఆనందం ఇటీవల బైక్ మీద వెళు తుండగా కుక్క అడ్డంరావడంతో రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగి గాయల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఆయన మిత్రులు, 2005- 06 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులంతా ఆనందం ఇంటికి వెళ్లి పరామర్శించారు. రూ. 30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగాతోటి స్నేహితులకు ఆనందం కృతజ్ఞతలు తెలిపారు. సహచర మిత్రుడికి అండగా నిలిచిన పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.కార్యక్రమంలో గొంప లక్ష్మణ, గండి అలీ, జి. రమేష్, సి.హెచ్ .రాంబాబు, గోర్స ప్రకాష్, గుడే నాగరాజు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బొడ్డేడ మురళికి సత్కారం



మురళిని సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ ఆహ్వానం మేరకు అమ్మవారి ప్రతిష్ఠ శతజయంతి ఉత్సవాలలో సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ మురళి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మురళిని, ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో ప్రతిష్ఠ శతజయంతి ఉకమిటీ ఛైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కోఛైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉపాధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, సహాయ కార్యదర్శి గ్రంధి వి.వి.,యుఎస్.మాణిక్యం, ఉత్సవ కమిటీ ఛైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, సూరే సతీష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని ఎన్ పేట గ్రామంలో ఆంజనేయస్వామి 11వ తీర్థం సందర్భంగా ఆదివారం ఎడ్ల బళ్ల పరుగుపందెం పోటీలు నిర్వహించారు. పోటీలను అనకాపల్లి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మలసాల భరత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. పలు మండలాల ఎడ్లబళ్ల పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో విశాఖ డైయిరీ డైరెక్టర్ మలసాల రమణరావు, మాజీ జెడ్‌పిటిసి మలశాల దనమ్మ, వైసిపి మండల అధ్యక్షులు మలశాల కిషోర్, యువజన నాయకులు మలశాల కుమార్ రాజా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ఎపిఇపిడిసిఎల్ సెక్షన్ పరిధిలోని కన్నూరుపాలెం సబ్ స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఈనెల 10న సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సంస్థ ఆపరేషన్స్ ఇఇ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. కన్నూరుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని కన్నూరుపాలెం, పాత కన్నూరుపాలెం, తీడ, చరకం, లాలం కొత్తూరు, సుందరయ్యపేట, ఆనందపురం, జి భీమవరం, అడ్డాము, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మొస్సయ్యపేట, గోకువానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

యథేచ్ఛగా ఇసుక దందా!

- రేయింబవళ్లూ అడ్డూ అదుపూ లేకుండా అక్రమ రవాణా
- ప్రభుత్వ నిబంధనలకు తూట్లు
- కన్నెత్తి చూడని అధికారులు
- ట్రాక్టర్ యజమానులే దళారులు?

శారదానదీ గర్భంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు, తరలింపు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని శారదా నదిలో ఇసుక దోపిడీకి అడ్డూఅదుపూ లేకుండా పోతుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో పోటా పోటీగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. మండలంలోని తామరబ్బ, తిమిరాం, కలిగొట్ల, బోయిల కింతాడ, తెనుగుపూడి పంచాయతీ విస్సరవు వీధి సమీపంలోని శారదా నదిలో గురుకులం ప్రహరీ గోడకి ఆనుకొని ఉన్న శారదా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుకను తోడేస్తున్నారు. పగలు రాత్రి తేడాలేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. శారదా నది సమీపంలోకి ట్రైరు బళ్ళు, ట్రాక్టర్లతో డంపుచేసి, రాత్రి వేళల్లో లారీలతో ఇసుక తరలిస్తున్నారు .ఇంత జరుగుతున్నా పోలీస్, రెవెన్యూ అధికార యంత్రాంగం కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదనే విమర్శలున్నాయి. మామూళ్ల మత్తుకు అలవాటు పడడం వల్లే అధికార యంత్రాంగం అటు రావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

రాత్రి వేళల్లో ఇసుక ట్రాక్టర్లు, లారీల రాకపోకలతో విపరీతమైన శబ్దాలువ్యంతో సరిగ్గా నిద్ర పట్టడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితమని ఒకవక్క ప్రకటనలు చేస్తున్నా.. దేవరాపల్లి మండలంలో మాత్రం పైకం ఇసుక

శారదనది ఒడ్డున అక్రమ రవాణాకు సిద్ధం చేసిన ఇసుక కుప్పలు

తోలాల్సిందేనని ఇసుక దళారులు దర్జాగా చెబుతున్నారు ఇసుక అక్రమ రవాణాకు ట్రాక్టర్ల యజమానులే.. అసలు దళారులని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక వ్యవహారంపై ఇద్దరు ట్రాక్టర్ యజమానులు మాట్లాడుకున్న ఆడియో రికార్డింగ్ స్థానికంగా సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

ప్రభుత్వ నిబంధనలకు తూట్లు

ప్రభుత్వ నిబంధనలకు ఇసుకాసురులు తూట్లు పొడుస్తున్నారు. మండలంలోని ఎక్కడా ఇసుక రీచ్‌లు గుర్తించకపోయినా, నదీ తీర ప్రాంతాల్ని పూర్తిగా గుల్ల చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన రీచ్‌ల నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకున్నాకే వారికి ఇసుక సరఫరా అవకాశం ఉండగా, మండలంలో అటువంటి నిబంధనలేవీ కానరావు. ట్రాక్టర్ల యజమానులు, ఇసుకాసురులు ఆడిందే ఆటగాఇక్కడ ఇసుక దందా సాగుతోంది.

ఇలా ఇసుక తోడేస్తే భవిష్యత్తులో భూగర్భ జలాలు అడుగంటుతాయని, నదిపరివాహక ప్రాంతాల్లోని పంటపొలాలు, ఆస్తులకు నష్టం వాటిల్లుతుందని,అంతేకాక వర్షాల సీజన్‌లో ఇసుకకోసం తవ్విన గోతుల్లో ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటు న్నాయని స్థానికులు ఆందోళన, ఆవేదన చెందుతున్నా, తమ జేబులను నింపుకోవడమే లక్ష్యంగా ఇసుక దందా కొనసాగిస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని, వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు దీనిపై స్థానిక అధికారుల వద్ద ప్రస్తావించగా అనుమతులు ఎవరికి ఇవ్వలేదని, ఎవరైనా పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల నాటివేత

మొక్కలు పంపిణీ చేస్తున్న జనసేన ఇన్‌ఛార్జి రాంకీ

ప్రజాశక్తి- అనకాపల్లి : మొక్కలునాటి, పర్యావరణాన్ని పచ్చదనాన్ని కాపాడుకుందామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకి అన్నారు. ఆదివారం గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో సుంకరమెట్ట సత్యనారాయణ, సూర్యనారాయణ దేవస్థానం ఆవరణలో కొబ్బరి మొక్కలు, మామిడి, ఉసిరి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, పశు పక్ష్యాదుల సంరక్షణకు గ్రీన్ క్లబ్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. తాను కూడా క్లబ్బు సభ్యత్వం తీసుకుని గ్రీన్ క్లబ్ టీ షర్టు ధరించి కార్యక్రమంలో పాల్గొన్నారు. సూర్యనారాయణ దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ మురళి, గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, క్లబ్ గౌరవాధ్యక్షులు పెంటకోట ఉమామహేశ్వరరావు, ఎల్లపు సూరి అప్పారావు, భోగ లింగేశ్వర దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, రావూరి అనిత, పి భారతి, అనిత, బేతాళం శేష సాయి, ఆడారి శ్రీనివాసరావు, నైశెట్టి సత్తిబాబు, కొడమంచిలి సుందరి శ్రీనివాస్, రంజిత, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు మరమ్మతుల్లో నిర్లక్ష్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : రోడ్లు మరమ్మతులు చెప్పట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేసారు.రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేసిన రోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదన్నారు.కొత్తూరు ఎఎంఎఎల్ కాలేజీ బ్రిడ్జిపై నుంచి వడ్డాది ,రావికమతం వరకూ రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉందన్ని, కొన్నిచోట్ల రక్షణ గోడలు కూడా లేకపోవడం బాధాకరమని అన్నారు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో ఆటోల్లో పనులకు వెళుతున్న దినసరి కూలీల కార్మికులు ప్రమాదాలు గురై క్షతగాత్రులుగా మారుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకుండా మొక్కుబడిగా పనులు చేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు మామూళ్లకు అలవాటు పడి పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు .కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు, సిపిఐ నాయకులు కె వీరాచారి, కోరిబిల్లి శంకరరావు,విత్తనాల పోతురాజు, రామారావు, ఎన్.సత్యనారాయణ,ఎమ్. సూరిబాబు పాల్గొన్నారు

నేడు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించాలి

ప్రజాశక్తి- కశింకోట : ఈనెల 10న సోమవారం జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా 1-19ఏళ్ల వారికి అల్బెండజోల్ మాత్రలను మింగించాలని తాళ్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎ.మనీషా సూచించారు. ఆదివారం ఆరోగ్యసిబ్బందికి అవగాహన కల్పించారు. సోమవారం మధ్యాహ్న భోజనం తర్వాత అంగన్వాడీ, పాఠశాలలకు వెళ్లిన పిల్లలతోపాటు పాఠశాలకు వెళ్లని పిల్లలతో మాత్రలు మింగించాలని సూచించారు. నులిపురుగులు వల్ల వచ్చే నష్టాలు పిల్లలకు, వారి తల్లిదండ్రులకు వివరించి, కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎంఎస్‌వి. ప్రసాద్, ఎవి.సుబ్బారావు , నరసింహారావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి -అచ్యుతాపురం :స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దొడ్డి కోటేశ్వరరావు పర్యవేక్షణలో చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు. చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

భజన, కోలాటం బృందాలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : భజన, కోలాటం బృందాలకు వేదిక దర్శనాలతోపాటు అన్నప్రసాదం, వసతి, దారిఖర్చులను దేవస్థానాలే భరించి ప్రోత్సాహించాలని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతులు విజయ శంకర స్వామి అన్నారు. ఆదివారం అనకాపల్లి నూకాంబిక దేవస్థానంలో భజన బృందాల అఖండ హరినామ సంకీర్తనలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

నూకాంబిక దేవాలయంలో అమ్మవారి అఖండ నామ సంకీర్తన ప్రతి గురువారం జరుగుతున్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి భజన గురువులు, కళాకారులు, అన్నమయ్య కళాక్షేత్రం జిల్లా కన్వీనర్ బత్తుల రవిశేఖర్, కార్యవర్గ సభ్యులు జైభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్జాని యోధ రమణ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

రైతులందరూ ఐడి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేందుకు రైతులందరూ ఐడి జనరేట్ చేసుకోవాలని జనసేన మండల అధ్యక్షుడు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు అన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. తమ ఆధార్ కార్డు, భూమి 1బి రికార్డు, ఆధార్ నెంబర్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్‌తో సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. వచ్చేనెల 30 తర్వాత ఐడి ఉన్న వాళ్ళకు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ లబ్ధి అందుతుందని స్పష్టం చేశారు.

గీత కులాల మద్యం షాపుల లాటరీ వాయిదా

ప్రజాశక్తి-అనకాపల్లి :గీత కులాలకు మద్యం షాపుల కేటాయింపునకు ఈనెల 10న నిర్వహించాల్సిన లాటరీ ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా పడిందని జిల్లా ప్రొహిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తాత్కాలిక వాయిదా వేశామని, దరఖాస్తుదారులు గమనించాలని కోరారు. లాటరీ ప్రక్రియకు తదుపరి షెడ్యూల్ తర్వాత విడుదల చేస్తామన్నారు.

రోడ్ల మరమ్మతుల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 81వ వార్డు గవరపాలెంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డును ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాలతో మరమ్మతులు చేపట్టారు. గవరపాలెం ప్రధాన రహదారి అగ్ని మరిచెట్టు వీధిలో కొన్ని నెలలుగా అధ్వానరోడ్లతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కూటమి నాయకులు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ దృష్టికితేగా, వారు అధికారులతో మాట్లాడి, పనులకు ఆదేశించారు. దీంతో శరవేగంగా పనులు జరుగుతున్నాయి, రోడ్డు నిర్మాణనాణ్యతను 80, 81వ డివిజన్ల ఇన్‌చార్జిలు బిఎస్‌ఎంకె జోగినాయుడు, విల్లూరి హరికృష్ణ, స్థానిక నాయకులు కాండ్రేగుల ఉమ, మళ్ల మోహన్, ఆళ్ల రవి, కొణతాల బాలకృష్ణ, ఆళ్ల జగన్ పరిశీలించారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ శిక్షణ

-శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్

బహుమతి అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

ప్రజాశక్తి- నక్కపల్లి: పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఆదివారం ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్య, సాంస్కృతిక, క్విజ్, ఆటలు, యోగా, పోటీ పరీక్షలు వంటి అనేక అంశాల్లో జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ కనబరిచిన, నూటికి నూరు శాతం హాజరు కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో అభినందన సభ నిర్వహించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా ఇతర రంగాలలో కూడా ప్రతిభ కనబరిచే విధంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థ తీర్చి దిద్దుతుందన్నారు. అన్ని రంగాలలోనూ విద్యార్థులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి వారి అభిరుచికి తగిన రంగంలో శిక్షణ ఇవ్వడం ద్వారా పట్టణ, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు విజయం సాధిస్తున్నారన్నారు. దీనికి నిదర్శనం గత ఏడాది కాలంలో సీబీఎస్ఈ క్లస్టర్, వివిధ క్రీడా పోటీలలో విద్యార్థులు జాతీయస్థాయిలో వారి ప్రతిభను చాటి అత్యధిక స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారని అన్నారు. తమ సంస్థ ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా ఉంటుందని, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడమే కాక వారి భావి జీవితాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లడానికి దోహదపడుతు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల వివిధ విభాగాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వేలో సమస్యలను సరి చేసేనా?

సర్వే చేసిన భూమిలో వేసిన సర్వే రాయి

ప్రజాశక్తి కోటవురట్ల: గత ప్రభుత్వంలో ఎంతో అట్టహాసంగా చేపట్టిన జగనన్న భూ సర్వేలో లోపాలు కూటమి ప్రభుత్వమైనా సరి చేస్తుందా అని గ్రామాలలో రైతులు, సహా పలు సంఘాల నాయకులు ఆశగా ఎదరు చూస్తున్నారు.

గత ప్రభుత్వంలో మండలంలో 13 గ్రామాల్లో జగనన్న భూ సర్వే నిర్వహించారు. సుంకపూరు, రామన్నపాలెం, రాజుపేట,ఎండపల్లి, అన్నవరం, జల్లూరు, చౌడవాడ, తంగేడు, లింగాపురం, కేపీ అగ్రహారం, కోటవురట్ల ,బీకేపల్లి, పాములవాక, గ్రామాలలో రీ సర్వే నిర్వహించారు. రీ సర్వే ప్రక్రియ పట్ల ఆది నుండి అధికారులకు రైతులకు సమస్యలే వెల్లువెత్తాయి.

ఓ పక్క రైతులు వారికి రీ సర్వేలో జరిగిన పొరపాట్ల గురించి ఆవేదన, ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రీ సర్వే జరిగిన గ్రామాలలో గ్రామసభల నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ క్రమంలో మండల వ్యాప్తంగా జరిగిన 13 గ్రామాలలో 850 వరకు రీ సర్వే పై జరిగిన గ్రామ సభలలో ఫిర్యాదులు అందజేశారు. అనంతరం మరికొద్ది రోజులలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సుల సమయంలో కూడా అత్యధికంగా రీ సర్వేలో సమస్యలను ఫిర్యాదుల రూపంలో చేసుకున్నారు, అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడ లేదని ఆయా గ్రామాల్లో రైతులు తెలిపారు.

మండల వ్యాప్తంగా రీ సర్వే నిర్వహించిన 13 గ్రామాలలో 15280 రీ సర్వే రాళ్లను సిద్ధం చేయగా 11 గ్రామాలలో నిర్వహించిన రీ సర్వేలో 12612 సర్వే రాళ్లను ప్లాంటేషన్ చేసినట్లు అధికారులు అధికారికంగా వెల్లడించారు. కాగా క్షేత్రస్థాయిలోకి వెళితే ఎక్కడి రాళ్లు అక్కడే దర్శనమిస్తూ ఉన్నాయి. ఒక్కొక్క స్టోన్ ప్లాంటేషన్ కోసం దాదాపు రూ.150 వరకు ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సుంకపూర్ గ్రామంలో 1864 సర్వే రాళ్లు సిద్ధం చేయగా పూర్తిస్థాయిలో ప్లాంటేషన్ చేసినట్లు అధికారులు తెలిపినా, గ్రామంలో ఎక్కడ చూసినా సర్వే రాళ్లు వృధాగా దర్శనమిస్తూ ఉన్నాయి. పలుచోట్ల సర్వే రాళ్లు దుర్వినియోగం కూడా అయ్యాయి.

అదేవిధంగా అన్నవరం గ్రామంలో 315 రాళ్లు ఏర్పాటు చేసినట్లు గణాంకాలు వెలడిస్తూ ఉండగా, గ్రామంలో కొన్ని ప్రాంతాల్లో రైతులు భూముల్లో సర్వే రాళ్లు ఏర్పాటు చేయలేదంటూ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి గత వైసిపి ప్రభుత్వం లో ఏర్పాటు చేసిన రాళ్లపై జగన్ ముద్రను చెరిపి వేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ఒక్కొక్క స్టోనుకు 15 రూపాయల చొప్పున ఖర్చుతో తొలగించేదుకు ఏర్పాట్లు చేసింది. రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో సమగ్ర విచారణ చేపట్టి పూర్తిస్థాయిలో సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలంటూ రైతులు, వివిధ సంఘాల నాయకులు కోరుతున్నారు.

అన్నవరంకు చెందిన ఇన్నం వెంకయ్య మాట్లాడుతున్న సర్వే నంబర్ 215/216లో గతంలో నాకు మూడు ఎకరాల సుమారు భూమి ఉండేది. పిల్లలకు ఇవ్వగా ఎకరా సెంట్లు వరకు నాకు ఉంది. సర్వే రాళ్లు పాతకుండానే పుస్తకాలు మాత్రం అందజేశారు. గ్రామ సభలో తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదు.

జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో ఎండపల్లి కేంద్రంగా జోరుగా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. గడిచిన కొద్ది రోజులుగా దళితులకు ఇచ్చిన డి పట్టా కొండ భూముల నుండి రాత్రి సమయంలో జెసిబి సహాయంతో లారీల ద్వారా నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు చెందిన పలు గ్రామాలకు గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. అయినా అటువైపు రెవెన్యూ అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడక పోవడంతో ఇష్టారాజ్యంగా రాత్రి సమయంలో లారీలతో అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. డిపట్టా భూముల యజమానులకు భూమి లెవెల్ చేస్తామని ఆశ చూపి ఈ తతంగమంతా నడుస్తున్నట్లు తెలిసింది. అన్నవరం సెంటర్ నుండి వజ్రగడ వెళ్లే దారిలో కొండ ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని తరలించుకుపోతున్నారు. పోలీసులు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాక్టర్‌లో తరలిస్తున్న గ్రావెల్

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-నక్కపల్లి: పాకరావుపేట మండలం గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1987 విద్యా సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ 40 ఏళ్ల తర్వాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల వేదికగా వారంతా కలుసుకొని, ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ సంతోషంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, రామ నాగులతోపాటు, ముఖ్య అతిథులుగా హాజరైన జనసేన పార్టీ నాయకులు బుజ్జి, కన్నబాబు, ఎంపీటీసీ సభ్యులు లచ్చబాబులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆచంట రామకృష్ణ,ఎస్ నాగ భూషణం, దండు శివ, తోట రమేష్, కర్రి రమేష్,ఎల్ చిన్నరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో గొంప గ్రామ దేవత పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన క్విజ్ పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. ఈ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 22 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్కొక్క స్కూలును ఒక్కొక్క టీముగా విభజించి క్విజ్ పోటీలు నిర్వహించారు. రెండు రౌండ్లు గా జరిగిన ఈ పోటీల్లో రావికమతం ప్రైవేటు పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో రావికమతం హైస్కూల్ విద్యార్థులు, తృతీయ స్థానంలో కొత్తకోట హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. వీరికి వరుసగా రూ.10 వేలు, 7,500, 5వేల రూపాయల నగదు బహుమతి ఉత్సవ కమిటీ అందజేసింది.

కాటా వద్ద ఉన్న చెరకు

ఆందోళనలో చెరుకు రైతు

ప్రజాశక్తి-రోలుగుంట: చెరకు కాటా ప్రారంభం నుండి వారం పది రోజులు రవాణా జరగలేదని, దీని కారణంగా చెరకు ఎండిపోయి ఎంతో నష్టపోతున్నామని రోలుగుంట, జె.నాయుడుపాలెం కాటాల పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో రోలుగుంటలోను, జె.నాయుడుపాలెం గ్రామంలో రెండు చెరకు కాటాలు ఉన్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి వారం నుండి 10 రోజుల వరకు ఫ్యాక్టరీ నుండి లారీలు రాక చెరకు ఎండిపోతుందని, దీంతో చెరకు ఎండిపోయి నష్టపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా చెరకును తరలించాలని వారు కోరుతున్నారు.

పిఆర్‌టియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లిలో పిఆర్‌టియు యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి ప్రాంతంలో సేవలు అందించిన యూనియన్ తొలితరం నాయకులు వనపరి సామ్యూల్‌ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా పిఆర్టియు అధ్యక్షులు యువి గిరి, రాష్ట్ర కౌన్సిలర్ కే.మత్యాలింగం, మండల గౌరవ అధ్యక్షురాలు శెట్టి ఉత్తర కుమారి, ఉపాధ్యక్షులు కూడా సత్తిబాబు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు అందక అవస్థలు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో బికెపల్లి, రామచంద్రపాలెం గ్రామాలకు సంబంధించి నాలుగు డిపోలకు గడిచిన కొన్ని నెలలుగా రేషన్ సరుకులు సక్రమంగా అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో బి కే పల్లి 3,38, రామచంద్రపాలెంలో 4,5, డిపో నెంబర్లకు సంబంధించి రేషన్ సరుకుల పంపిణీ సకాలంలో అందకపోవడంతో రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ డిపోలకు సంబంధించి గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో ఎండియు వాహన నిర్వాహకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై వాహనాన్ని నిలిపివేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ డిపోలకు సంబంధించి రేషన్ సరుకులు ఏ రోజు ఎప్పుడు ఎక్కడ ఇస్తారో తెలియక లబ్ధిదారులు ఆయా గ్రామాల్లో దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. పదో తారీకు వచ్చినా సరే కానీ నేటికీ ఆయా గ్రామాల్లో పూర్తిస్థాయిలో సరుకులు అందక ఇబ్బందులు పడుతున్నారు.

ఒకపక్క ప్రభుత్వ విధులకు హాజరవుతూ మరోవైపు ప్రతి నెలా డిపోలకు వేలిముద్రలు వేయడం ఇబ్బందిగా ఉన్నట్లు సంబంధిత గ్రామాల విఆర్ఏ అప్పలకొండ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా గ్రామాలలో ఎండియు వాహనాన్ని ఏర్పాటు చేయాలని సకాలంలో సరుకులు అందే విధంగా చర్యలు చేపట్టాలని పలు గ్రామాలకు చెందిన గ్రామస్తులు, లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

డిపో వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

దుకాణదారులతో మాట్లాడుతున్న సిఐ

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో రోడ్డుకు ఇరువైపులా దుకాణాదారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించ వద్దని స్థానిక టౌన్ సిఐ గోవిందరావు తెలిపారు. ఆర్డిఓ ఆఫీస్ నుండి ఆబీద్ సెంటర్, అభిద్ సెంటర్ నుండి కృష్ణ బజార్ వరకు రోడ్డుకు సమీపాన వ్యాపారాలు చేస్తున్న షాపులను యజమానులతో మాట్లాడారు. ట్రాఫిక్ నకు ఎటువంటి అంతరాయం కలిగించకుండా వెనక్కి జరిపించారు. రోడ్ల మీద వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులకు పట్టణ సిఐ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ ఇచ్చారు.

వ్యక్తి దాడిలో మహిళలకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం సాలికమల్లవరం గ్రామానికి చెందిన మాతే రాజబాబు అనే వ్యక్తి గ్రామస్తులతో తరచూ గొడవలకు తెగపడుతూ ఉంటాడు. ఈ మేరకు ఆదివారం కూడా ఇనుపరాడ్లతో, కర్రలతో ఇళ్ళపైకి దౌర్జన్యంగా ఎగబడి, ఒక వృద్ధురాలు, మరో మహిళను తీవ్రంగా గాయంవర్చాడు. రాజుబాబు గ్రామంలో కొత్త వరహాలమ్మ(75), కొత్త రాము(45) అనే ఇద్దరు మహిళలపై ఇనప రాడ్లతో కర్రలతో దౌర్జన్యానికి దిగి తీవ్రంగా గాయపరిచాడు. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గొలుగొండ ఎస్సై పి.రామారావుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ

క్వారీ వాహనాలను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-రోలుగుంట:

మైనింగ్ మాఫియా చేతుల్లో పర్యావరణ, మైనింగ్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు విమర్శించారు. ఆదివారం మాట్లాడుతూ రోలుగుంట మండలం శరభవరం పంచాయతీ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 216 కొత్త సర్వే నెంబర్ 231, 232 రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ ఎల్.రాజు పేరు మీద 4.790 యాక్టార్లు 40 క్వారీకి అనుమతులు ఇచ్చారన్నారు. ఈ క్వారీ అనుకొని పచ్చని వరి పొలాల మధ్యలో చెరువులు కూడా ఉన్నాయని, ఈ క్వారీ బ్లాస్టింగ్ కార్యకలాపాలతో రాజన్నపేట మీదుగా ఆర్ల పంచాయతీకి వెళ్లాలంటే భారీ శబ్దాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ రాయిని తీసుకొని 70 టన్నులు మించి భారీ వాహనాలు తిరగడంతో రోడ్లన్నీ గొయ్యిలుగా మారుతున్నాయన్నారు. దుమ్ము ధూళి, నాలుగు గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే భారీ వాహనాలు నిలుపుదల చేయాలన్నారు. క్వారీకు చెందిన భారీ వాహనాలు అడ్డుకోకపోతే సిపిఎం ప్రత్యక్ష ఆందోళన చేస్తుందని తెలిపారు.

స్వాగతం పలుకుతున్న పోర్టు ప్రతినిధులు

పోర్టును సందర్శించిన జాతీయ ఎస్‌సి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిశోర్ మక్వానా ఆదివారం తన బృందంతో కలిసి విశాఖపట్నం పోర్ట్ అథారిటీను సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్, డిప్యూటీ కన్జర్వేటర్ టి.శ్రీనివాస్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్శన సందర్భంగా అధికారులు పోర్ట్ ఆధునీకరణ, దిగుమతులు-ఎగుమతుసు, వ్యాపార అవకాశాలు తదితర అంశాలపై సమగ్ర సమాచారం అందించారు. వాణిజ్య విస్తరణ, కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలను ఛైర్మన్‌కు వివరించారు.

రైతు బజార్‌లో సబ్జీ కూలర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:ఎంవిపి రైతుబజార్లో ప్రయోగాత్మకంగా సబ్జీ కూలర్ను ప్రవేశ పెట్టి వినియోగిస్తున్నామని ఎంవిపి కాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ సమకూర్చిన ఈ సబ్జి కూలర్లో రైతులు కాయగూరలు, ఆకుకూరలు నిలువ ఉంచుకుంటే నాలుగు రోజుల వరకు తాజా ఉంటాయన్నారు. దీనికి ఎటువంటి కరెంట్ అవసరం కానీ, వినియోగ చార్జీలు అవసరం లేదన్నారు. దీనిలో ప్రతి రోజూ 25 లీటర్ల నీటిని నింపాలన్నారు. ఈ విధంగా కూరగాయలను నిలువ ఉంచడానికి ఎటువంటి రసాయనాల వినియోగం అవసరం లేదన్నారు. దీంతో రైతులకు ఆర్థిక భారం ఉండదన్నారు. దీన్ని రైతులంతా వినియోగించి ఆర్థికంగా లాభ పడాలని ఆయన కోరారు.

కబడ్డీ ఆడుతున్న మహిళా జట్టు క్రీడాకారులు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో ఎం.కోడూరు గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం పోటీలు, గుర్రం పరుగు పందెం పోటీలతో పాటు ఉత్తరాంధ్ర మహిళా కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, ఎంపీటీసీ ముమ్మిన రవణ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. మహిళా కబడ్డీ జట్ల మధ్య పరాహరిగా పోటీలు జరిగాయి. అన్ని పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. రాత్రికి సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పడాల అప్పలనాయుడు, గెంజి రాజేష్ కుమార్, కలిమి గోపాల్ పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు మద్దతు ఇవ్వండి

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై ఈనెల 11,12 తేదీలలో తలపెట్టిన మన్యం బంద్ విజయవంతం చేయాలని అఖిల పక్ష, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో పాడేరు పట్టణంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, మహిళా సంఘం నేతలు విమల, రవణమ్మ, తనీష్. తదితరులు వర్తక వ్యాపార వర్గాలను కలిసి బంద్ పాటించి మద్దతు ఇవ్వాలని కోరారు. మన్యం బంద్ విజయవంతం చేయాలని అల్లూరి సీతారామరాజు జిల్లా, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.రాజశేఖర్, ఎం.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ 1/70 చట్టం ఆదివాసి గిరిజనులకు రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వి. కృష్ణ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, నాయకులు, బి. పెంటరావు కె. సురేష్, మంగ, రాజీ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తోందని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర అన్నారు. అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో ఆదివారం ఆదివాసి అఖిలపక్ష ప్రజాసంఘాలు అధ్వర్యంలో చేపట్టిన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారుఈ సందర్భంగా కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో బాక్సైడ్‌ను తియ్యాలని కూటమి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తోందని, అందులో భాగంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు.సిఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమమహేశ్వరరావు. మాట్లాడుతూ, అరకులోయలో ప్రభుత్వం పర్యాటకుల కోసం కోట్లాది రూపాయిలు ఖర్చు చేసి అరకు చలి ఉత్సవాలు నిర్వహించారని, దీంతో గిరిజనులు ఒరిగేది ఏమీ లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్,సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు,ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు,వైఎస్ఆర్ సీపీ నాయకులు కమిడి అశోక్ పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు :ఈనెల 11 12 తేదీల్లో చేపట్టే మన్యం బంధును జయప్రదం చేయాలని అఖిలపక్ష ప్రజాసంఘాల నేతలు గోడ పత్రికలను ఆదివారం ఆదివాసి గిరిజన సంఘం కార్యాలయం లో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం ఎం శ్రీను, కొర్ర నరసయ్య లు మాట్లాడుతూ, 48 గంటల పాటు ఏజెన్సీ బందును జయప్రదం చేయాలని కోరారు.

హుకుంపేట: మన్యం బంద్‌ను విజయవంతం చేయాలనీ అఖిలపక్ష, ఆదివాసీ ప్రజాసంఘాల వేదిక నాయకులు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కృష్ణారావు మాట్లాడుతూ, బంద్‌పై మండలంలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు మద్దతు తెలియ చేస్తునట్టు తెలిపారు.ఆదివాసి మహిళ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శి కౌసల్య హైమావతి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సోమన్న లింగమూర్తి, రామారావు పాల్గొన్నారు.